ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలి

- బేస్‌మెంట్ పూర్తయిన ఇండ్లకు తక్షణమే చెల్లింపులు
- ఏ గ్రామంలోనూ త్రాగునీటి సమస్య రానివ్వొద్దు : మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

పైలట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని , బేస్‌మెంట్ పూర్తయిన ఇళ్లకు తక్షణం చెల్లింపులు జరపాలని వరంగల్ జిల్లా ఇన్ ఛార్జి , రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వరంగల్ స్మార్ట్ సిటీ పనులు , వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, త్రాగునీరు, ఇందిరమ్మ ఇళ్లు తదితర అంశాలపై పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, అటవీ , దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా శాసనసభ్యులు, కలెక్టర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఈ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతా అంశమని దీనిని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్లు పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ప్రభుత్వం నాలుగు విడతలలో చెల్లింపులు చేస్తుందని, మొదటి విడతలో బేస్ మెంట్ లెవెల్ పూర్తయిన ఇండ్లకు లక్ష రూపాయిలు ఇస్తుందని, బేస్ మెంట్ పూర్తయిన ఇళ్ల వివరాలను హౌసింగ్ విభాగానికి పంపిస్తే తక్షణమే చెల్లింపులు చేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఇళ్ల స్థలాలు లేని అర్హత కలిగిన లబ్దిదారులకు ఇప్పటివరకు కేటాయించని 2 బిహెచ్‌కె ఇళ్లను కేటాయించాలని అలాగే మొండి గోడలతో ఉన్న ఇండ్లను పూర్తిచేయడానికి కాంట్రాక్టర్ ముందుకు రాని పక్షంలో లబ్దిదారులే ఆ ఇండ్లను పూర్తిచేసుకోవడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని లబ్దిదారులను ఎంపిక చేసి ఇండ్లను కేటాయించాలని సూచించారు.

వేసవి కాలంలో ఏ గ్రామంలో పట్టణంలోగానీ త్రాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి. ప్రధానంగా జిల్లా కలెక్టర్లు ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అధికారులతో సమన్వయం చేసుకొని అధికారులు వారంలో మూడు రోజులు గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. వచ్చే మూడు నెలలు చాలా కీలకమని ప్రజలకు ఎక్కగా త్రాగునీటి గురించి ఇబ్బంది కలగకుండా నీళ్లు రావడం లేదన్న విమర్శ రాకుండా పనిచేయాలన్నారు. నీటికొరత ఉన్న ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా త్రాగునీరు సరఫరా చేయడం, చెడిపోయిన బోర్లు, హ్యాండ్ పంప్ లను తక్షణం మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తిచేసి ఆ తర్వాత మరో నెలరోజుల్లో వైద్య సేవలకు అవసరమైన పరికరాలను అమర్చి జూన్ చివరినాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలి. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

మడికొండ డంపింగ్ యార్డు సమస్యకు వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపించి ఆ తర్వాత శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. దీనికి సంబంధించి సిడిఎంఎ డైరెక్టర్ శ్రీదేవిని స్వయంగా అక్కడ పర్యటించి పరిష్కార మార్గాలను సూచించాలని ఆదేశించారు. వరంగల్, కరీంనగర్ రహదారి ప్రాంతంలో శాశ్వత డంపింగ్ యార్డు కోసం 150 నుంచి 200 ఎకరాల భూమిని సేకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. వరంగల్ భద్రకాళి చెరువు పూడికతీత పనులను ఎట్టిపరిస్థితులలోను వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పూర్తిచేయాలన్నారు. వరంగల్ స్మార్ట్ సిటీ పనుల విషయంలో అధికారులు ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని సూచించారు.

ఈ సమావేశంలో శాసనసభ్యులు కడియం శ్రీహరి, నాయని రాజేందర్, యశస్విని రెడ్డి, దొంతి మాధవరెడ్డి, నాగరాజు, మురళీనాయక్, రామచంద్ర నాయక్, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, ఆర్ అండ్ బి సెక్రెటరీ హరిచందన, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

ఊబర్, ఓలా, రాపిడోలకు ప్రత్యామ్నాయంగా సహకార్ యాప్‌ను స్వాగతిస్తున్నాం : సిఐటియు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఊబర్, ఓలా, రాపిడో, మొదలైన వాటికి ప్రత్యామ్నాయంగా సహకార్ యాప్‌ను ప్రారంభించబోతున్నట్టు పార్లమెంట్‌లో హోంమంత్రి అమిత్‌షా ప్రకటన చేయడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలంగాణ పబ్లిక్, ప్రయివేటు రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్-సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతిపాదిత యాప్ ప్రారంభంలోనే డ్రైవర్లు, ప్రయాణీకుల కష్టాలను, లోపాలను పరిష్కరించి, గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను కూడా యాప్‌లో చేర్చాలని కోరారు. అలాంటి యాప్‌ను అభివృద్ధి చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఎనిమిదేండ్లుగా పోరాటం చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈనెల 24న నిర్వహించిన చలో పార్లమెంట్ కార్యక్రమంలో అది కూడా ఒక ప్రధాన డిమాండ్ అని తెలిపారు. సహకార్ యాప్ ప్రారంభం సిఐటియు విజయమేనని పేర్కొన్నారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ దీనిపై దేశవిదేశ సాంకేతిక నిపుణులతో సంప్రదింపులు జరిపిందనీ, ఎనిమిదే కిందట నాగ్‌పూర్‌లో జాతీయ స్థాయి వర్క్‌షాపును కూడా నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ తర్వాత కేరళ ప్రభుత్వం కేరళ రాష్ట్ర మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ద్వారా "సవారి" అనే యాప్‌ను అభివృద్ధి చేసిందని తెలిపారు. ప్రయివేటు యాప్ ఆధారిత కంపెనీలు డ్రైవర్ల రక్తాన్ని పీల్చుతూ, ప్రయాణీకులను వివిధ విధాలుగా దోపిడీ చేస్తున్నాయని పేర్కొన్నారు. కంపెనీల దోపిడీ, వేధింపులకు వ్యతిరేకంగా, ఆ కంపెనీలకు అనుబంధంగా ఉన్న డ్రైవర్లు ఢిల్లీతో సహా అనేక నగరాల్లో గతంలో సమ్మెలు చేశారనీ, కొంతమంది డ్రైవర్లు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని ప్రస్తావించారు. డ్రైవర్లు, ప్రయాణీకుల ప్రయోజనం కోసం యాప్‌ను ఎలా అభివృద్ధి చేయాలనే దానిపై కేంద్రానికీ, ప్రధానికి అన్ని విషయాలతో ఎఐఆర్‌టిడబ్ల్యు ఎఫ్ వినతిపత్రాలను కూడా ఇచ్చిందని తెలిపారు. ఎట్టకేలకు సహకార్ యాప్‌ను ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలకు సృజనాత్మక విలువలు

- ఆచార్య కొలకలూరి ఇనాక్

ప్రజాశక్తి కల్చరల్

సృజన సాంస్కృతిక కార్యక్రమాలు సృజనాత్మక విలువలు కలవని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అభినందించారు శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై సజన సాంస్కృతిక సాహిత్య సంస్థ నిర్వహణలో రాబోయే ఉగాది పండుగ పురస్కరించుకొని జీవిత సాఫల్య పురస్కారంతో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణను సత్కరించారు. రెవెన్యూ శాఖ మంత్రి ప్రత్యేక అధికారి శ్రీలక్ష్మిని, ప్రముఖ వైద్యుడు అఖిల్ దాడిని, సీనియర్ జర్నలిస్ట్ ఎవిఎ ప్రసాద్‌ను, అపోలో ఆస్పత్రిలో డైటీసియన్ హరిత శ్యామ్‌ను, సీనియర్ జర్నలిస్ట్ వల్లేశ్వర్‌ను సజనా ప్రతిభా పురస్కారాలతో సాంస్కృతిక సంస్థల ప్రముఖులు వంశీ రామరాజు వెంకట రెడ్డి నాట్య గురువు ప్రసన్న రాణి సీనియర్ పాత్రికేయుడు అర్‌వి రమణలను ఉగాది పురస్కారంతో సత్కరించి మాట్లాడారు. దీక్ష దక్షతతో సృజన సంస్థ అంజనా చౌదరి నిర్వహిస్తున్నారని అభినందించారు. గుమ్మడి గోపాల కృష్ణ మనిషి ఆరోగ్యం కోసం కళలు మందు అన్నారు మంచి చేసే వారిని మార్గ దర్శనంగా గ్రహించాలి అని కోరారు. అయన ఆలపించిన పద్యాలు ప్రేక్షకులను సమ్మోహన పరిచాయి అంజనా చౌదరి స్వాగతం పలికిన సభలో శశి సుధీర్ పుంజాల వందన సమర్పణ చేశారు కృష్ణ వ్యాఖ్యానం చేసిన వేదిక పై పూర్ణిక పావని మనోజ్ఞ మాన్వి నృత్య అంశాలు ఆకట్టుకున్నాయి.

తెలుగు సాహిత్యంలో తొలి రచయిత్రి మొల్ల

ప్రజాశక్తి కల్చరల్

తెలుగు సాహిత్యం లో కావ్య రచనలో తొలి రచయిత్రి మొల్ల అని విశ్రాంత న్యాయమూర్తి విశ్వేశ్వర రావు అన్నారు శ్రీ త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదికపై ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా ఆతుకూరి మొల్ల యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ విశ్వేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ శ్రీ కృష్ణ దేవరాయలు కాలంలో కుమ్మరి కులంలో పుట్టిన మొల్ల స్వయం కృషితో సాహిత్యంలో నాటి కవి పండితులకు సమవుజీగా ఎదిగి రామాయణ మహా కావ్యం రచన చేశారని వివరించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో గాయకుడు త్రినాథ రావు శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అత్యంత శక్తిమంతుల జాబితాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- 2025 సంవత్సరానికి ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జాబితా
- వంద మంది అత్యంత శక్తిమంతుల్లో 28వ స్థానం

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

పరిపాలనా నైపుణ్యం.. ప్రభావవంతమైన రాజకీయంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత శక్తిమంతమైన నాయకునిగా నిలిచారు. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లి 2025 సంవత్సరానికి సంబంధించి దేశంలోని వివిధ రంగాల్లో అత్యధిక శక్తిమంతులైన 100 మంది ప్రముఖులతో జాబితా విడుదల చేసింది. ఈ జాబితాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 28వ స్థానం దక్కించుకున్నారు. 2024 సంవత్సరపు జాబితాలో 39 స్థానంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడాది కాలంలోనే ఏకంగా 11 స్థానాలు ఎగబాకి 28వ స్థానానికి చేరుకోవడం విశేషం. దేశంలో రాజకీయ, వ్యాపార, క్రీడా, వినోద రంగాల్లో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులు ఈ జాబితాలో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర పాలనలో తీసుకువచ్చిన మార్పులు, వ్యూహాత్మక రాజకీయ కార్యకలాపాలు, దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో పోషిస్తున్న ప్రముఖమైన పాత్రతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ గుర్తింపు లభించింది. తనదైన దూకుడుతో భారత రాజకీయాల్లో ఆయన

చూపుతున్న ప్రభావం, నాయకత్వ లక్షణాలతో ఆయన ర్యాంకు మెరుగుపడింది. ఒక ప్రాంతీయ నాయకుడినే కాకుండా దేశంలోనే అత్యంత శక్తిమంతమైన, చురుకైన ముఖ్యమంత్రుల్లో ఒకరిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిర్భవించారు. ఈ జాబితాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇండియా కూటమిలోని ఇతర ప్రముఖులైన సీఎంల సరసన నిలిపింది. ప్రాంతీయ అవసరాలను జాతీయ ప్రాధాన్యతలతో సమన్వయం చేయగలిగిన మేధో సంపత్తి, వ్యూహాత్మక దక్పథం రేవంత్ రెడ్డిని కీలక నాయకునిగా నిలిపేలా చేశాయి. శక్తిమంతులైన వంద మంది జాబితాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మొదటి 10 స్థానాల్లో ఉన్నారు.

విధానపరమైన నిర్ణయాలతో...

రైతు కుటుంబాలకు రూ. 21 వేల కోట్ల రుణ మాఫీ చేయడం, క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడం, మహిళా స్వయం సహాయక సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంక్‌లు, ప్రీమియం రిటైల్ స్టోర్ల వంటి వ్యాపార అవకాశాలను కల్పించడం, యువతను నిపుణులుగా తీర్చిదిద్దే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు, ట్రాఫిక్ పోలీస్ విభాగంలో ట్రాన్స్‌జెండర్‌ల నియామకం వంటి అనేక విధానపరమైన వినూత్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజాదరణ పెరగడానికి కారణమయ్యాయి. నియోజకవర్గాల పునర్విభజనపై చెన్నై సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తం చేసిన దఢమైన అభిప్రాయాలు కూడా ఆయనకు జాతీయ స్థాయిలో ప్రాధాన్యం దక్కేలా చేశాయి.

పారదర్శకమైన పాలన, రాష్ట్ర సమగ్రాభివద్ధికి కట్టుబడినందునే ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ అత్యంత శక్తిమంతుల జాబితా-2025లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గుర్తింపు లభించిందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ అన్నారు. ఈ గుర్తింపుతో దేశ, తెలంగాణ ప్రజల పట్ల ముఖ్యమంత్రి గారి బాధ్యతను మరింత పెంచిందని ఆయన పేర్కొన్నారు.

భారతీయ శక్తిమంతులైన జాబితాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చోటు లభించడం భారత రాజకీయాల్లో కీలక మార్పునకు సంకేతమని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ప్రాంతీయ నేతలు ఇప్పుడు జాతీయ విధానాల రూపకల్పనలో మరింత ప్రభావం చూపుతున్నారనడానికి ఇదే నిదర్శమని వారు పేర్కొన్నారు.

ముగిసిన ప్రజా చైతన్య పాదయాత్ర

- సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు
- రామన్నపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రామన్నపేట మండల సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సిపిఎం పోరాటం ఆపదని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో మండల సమగ్రాభివృద్ధి, ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆరు రోజులపాటు 24గ్రామాల్లో నిర్వహించిన ప్రజా చైతన్య పాదయాత్ర శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ లాల్ బహదూర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ.. రామన్నపేట పాత నియోజకవర్గంగా, పాత తాలూకాగా విరాజిల్లి ఇప్పుడు మండలంగా మాత్రమే ఉండి అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటయ్యే నియోజకవర్గాల పునర్విభజనలో రామన్నపేటను నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వాస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మారుస్తామని దశాబ్దకాలంగా ప్రభుత్వం చెబుతూ కాలమెళ్లదీస్తోందని విమర్శించారు. రెండు దశాబ్దాలు గడుస్తున్నా పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి కాలువలు పూర్తి కావడం లేదని, కాలువలను పూర్తిచేసి రైతుల భూములకు సాగు నీరందించాలని అన్నారు. ఇప్పటికీ మండలంలో ఏ గ్రామానికీ కనీసం బస్సుసౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమ కార్యాచరణ కొనసాగుతూనే ఉంటుందని చెప్పారు. రామన్నపేట శాసనసభ నియోజకవర్గం కావాలంటే పోరాటం చేయాల్సిందేనన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్‌రెడ్డి, పాదయాత్ర సారథి జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శివర్గ సభ్యులు బోయిని ఆనంద్, కందుల హనుమంతు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలి

- అన్ని రకాల వడ్లకూ మద్దతు ధర ఇవ్వాలి : జూలకంటి
- నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే, రాష్ట్రంలో అన్ని రకాల వడ్లనూ మద్దతు ధరకు కొనుగోలు చేసి బోనస్ చెల్లించాలని కోరారు. ప్రజాసమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. ధర్నాలో రంగారెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయోత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు రైతాంగ ఆత్మస్థైర్యాన్ని కుంగదీసే విధంగా ఉన్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరలు పుండు మీద కారం చల్లినట్టుగా ఉందన్నారు. ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం కలిపి మద్దతు ధరలు నిర్ణయించాలన్న ప్రతిపాదనను తుంగలో తొక్కి ఉత్పత్తి ఖర్చులకే 21 శాతం తగ్గించి ఎంఎస్‌పిని నిర్ణయించటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను సాగుచేస్తున్న రైతులందరికీ విడుదల చేయాలని, రెండు లక్షల రూపాయల రుణమాఫీని మిగిలిన వారందరికీ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రమాదంలో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రెండు కోట్ల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అన్నారు.సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు ఎప్పటి వరకు ఇస్తారో నిర్దిష్టమైన కాలపరిమితి ప్రకటించాలన్నారు. ఎండిపోయిన పంటలను పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని, ధాన్యం కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున అధ్యక్షత నిర్వహించిన ఈ ధర్నాలో రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నారి అయిలయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలం, సయ్యద్ హాషం, పాలడుగు ప్రభావతి, సిహెచ్ లక్ష్మీనారాయణ, వి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు గంజి మురళీదర్, పి నర్సిరెడ్డి, మల్లం మహేష్, దండెంపల్లి సత్తయ్య, రవి, శశిధర్‌రెడ్డి, వినోద్, శ్రీను, సరోజ, అనురాధ, శంకర్, చంద్రమౌళి, ఆనంద్, నగేష్, వెంకులు, వెంకన్న, సైదులు, బయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం సాధ్యమేనా..!

- ఉగాది కానుకగా రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం
- కొత్త రేషన్‌కార్డుల కోసం పది లక్షల దరఖాస్తులు పెండింగ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉగాది పండగ సందర్భంగా పేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆహార భద్రతా కార్డుదారులందరికీ ఏప్రిల్ 1 నుంచి దొడ్డు బియ్యం బదులు సన్న బియ్యాన్ని పంపిణీ చేయనున్నట్టు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఆ మేరకు ఖరీఫ్ సీజన్‌లో సేకరించిన సన్న ధాన్యాన్ని మరాడించి బియ్యం నిల్వల్ని గోదాముల్లో సిద్ధం చేస్తున్నారు. ఏడాదికి సరిపడినన్ని సన్న బియ్యం లేనందున యాసంగిలో సాగైన సన్న ధాన్యాన్ని సేకరించేందుకు పౌర సరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ ఎంతో మేలు చేసేది అయినప్పటికీ రాష్ట్ర అవసరాల మేరకు సన్న వరి సాగు కావట్లేదు. ఖరీఫ్, యాసంగి రెండు సీజన్లలో కలిపి కూడా రాష్ట్రానికి సరిపడినన్ని సన్న బియ్యం లభ్యమయ్యే పరిస్థితి లేదు. ప్రభుత్వం సన్న ధాన్యం మద్దతు ధరకు అదనంగా క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తున్నా రైతులు మాత్రం వాతావరణ పరిస్థితులు, పంట కాలం, పెట్టుబడులు, దిగుబడుల రీత్యా ఆశించిన మేరకు సన్న వరి సాగు వైపు మొగ్గట్లేదు. రాష్ట్రంలో కొత్తగా పది లక్షల కుటుంబాలు కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్నాయి. వారందరికీ సన్న బియ్యం అందాలంటే కార్డుల్ని మంజూరు చేయాల్సి ఉంది.

ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ షురూ

ఎన్నికల్లో చెప్పిన విధంగా రేషన్‌కార్డుదారులందరికీ సన్న బియాన్ని పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. రాష్ట్రంలో 89.96 లక్షల ఆహార భద్రతా కార్డులున్నాయి. వీటిల్లో 2.81 కోట్ల మంది లబ్దిదారులు నమోదై ఉన్నారు. ఏప్రిల్ నుంచి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రేషన్‌కార్డుల దరఖాస్తుదారులకూ కొత్తగా మంజూరు చేస్తామంటున్నారు. సుమారు పది లక్షల కుటుంబాలకు కొత్త కార్డులివ్వాల్సి ఉంటుంది. వాటిల్లో మరో 30 లక్షల మంది వరకు లబ్దిదారులు చేరే అవకాశముంది. వారందరికీ ప్రభుత్వం సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తామని చెబుతోంది. ఉగాది పండగ రోజున సిఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు పథకాన్ని ప్రారంభించనున్నారు.

అవసరాలకు సరిపడని సన్న వరి సాగు

రాష్ట్రంలో ఉన్న రేషన్‌కార్డుదారులందరికీ సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలంటే ఏడాదికి 23 నుంచి 24 లక్షల టన్నుల బియ్యం అవసరముంటుందని పౌర సరఫరాల శాఖ అంచనా వేసింది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన సన్న రకం ధాన్యాన్ని 24 లక్షల టన్నుల మేరకు సేకరించారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు అలాట్‌మెంట్ చేశారు. ఖరీఫ్ ధాన్యాన్ని మర ఆడించే పనులు వేగంగా సాగుతున్నాయి. ఖరీఫ్ ధాన్యాన్ని బియ్యంగా మారిస్తే 15 నుంచి 16 లక్షల టన్నుల మేరకు బియ్యం అందుబాటులోకి వచ్చే అవకాశముంది. అంటే ఈ ఏడాదికి కావాల్సిన 24 లక్షల టన్నుల బియ్యం ఖరీఫ్ ధాన్యం నుంచి చేతికందే పరిస్థితి లేదు. మొదటి ఆరు నెలలకు మాత్రం కొరత లేకుండా ఉంటుంది. మిగతా కాలానికి కావాల్సిన సన్న బియ్యాన్ని యాసంగి సీజన్‌లో సాగు చేసిన సన్న ధాన్యాన్ని సేకరించాలని పౌర సరఫరాల శాఖ బావిస్తుంది. ఏడు లక్షల టన్నుల బియ్యాన్ని సిద్ధం చేసుకోవాల్సి ఉండగా.. యాసంగిలో సాగైన సన్న వరి పరిమితంగానే ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 2050 రేషన్ దుకాణాలున్నాయి. 9,03,709 రేషన్‌కార్డులున్నాయి. వీటికి ప్రతి నెలా 15,929 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో 3.10 లక్షల రేషన్‌కార్డుల్లో నమోదైన 8,95,457 మందికి 5 వేల టన్నుల సన్న బియ్యం అవసరముంటుంది. ఈ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో కేవలం 3 వేల క్వింటాళ్ల సన్న ధాన్యాన్నే సేకరించారు. యాసంగిలోనూ 3101 ఎకరాల్లోనే సన్న వరి సాగు చేశారు. సిద్దిపేట జిల్లాలో 3.78 లక్షల రేషన్‌కార్డులుండగా వీటిల్లో 12.33 లక్షల మంది లబ్దిదారులున్నారు. 7 వేల టన్నుల బియ్యం పంపిణీ చేయాలి. మెదక్ జిల్లాలో 2,14,155 రేషన్‌కార్డులుండగా వీటిల్లో 6.84 లక్షల మంది లబ్దిదారులున్నారు. 4367 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈ రెండు జిల్లాల్లోనూ ఖరీఫ్, యాసంగి కలిపి సన్న రకం వరి సాగు జిల్లా అవసరాలకు సరిపడా లేవు.

రీసైక్లింగ్ దందా ఆగేనా..?

లసన్న బియ్యం పంపిణీ ద్వారా దొడ్డు బియ్యం రీసైక్లింగ్ దందాకు తెర పడుతుందని ప్రభుత్వం చెబుతోంది. దొడ్డు బియ్యాన్ని రేషన్‌షాపుల్లో పంపిణీ చేస్తున్నారు. అట్టి బియ్యాన్ని బ్లాక్‌కు తరలించే మిల్లర్లు తర్వాత రీసైక్లింగ్ చేసి సన్న బియ్యంగా మారుస్తున్నారు. దొడ్డు బియ్యాన్నే సన్న బియ్యంగా మార్చి సీఎంఆర్ బియ్యంగా ఇస్తూ లాభాలు గడిస్తున్నారు.

నోటీసు
Section 5 of The Limitation Act
మహారాజశ్రీ కందుకూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No.49/2025
O.S.No.224/2008

బొర్రా కోటేశ్వర రావు - పిటిషనర్/వాది
ఎదిరి
పురిమెట్ల పోలమ్మ (లేట్)
మరియు నలుగురు - రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

పూరిమెట్ల రమేష్, తండ్రి కొండయ్య,
ఉప్పుచెరువు కాలనీ నివాసము, కందుకూరు మునిసిపాలిటీ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాదులను వారసులుగా చేర్చుటకు జరిగిన కాలహరణను మన్నించ వలసిందిగా కోరుతూ పిటిషనర్/వాది లిమిటేషన్ చట్టము క్రింద పిటిషన్ దాఖలు చేసివున్నారు. మీకు కోర్టు ద్వారానూ మరియు రిజిష్టరు పోస్టు ద్వారానూ నోటీసులు పంపినప్పటికి మీరు తీసుకొనక ఏదో ఒక కారణముతో త్రిప్పి పంపుతున్నారు. కావున మీరు **తే21-04-2025ది ఉదయం గం॥ 10.30 నిమిషములకు** మీరు స్వతహాగా గానీ, సంపూర్ణ సంజాయిషీ పొందిన అన్ని ప్రశ్నలకు సమాధానము చెప్ప కూడిన ప్లీడరు గారి ద్వారా పై కోర్టువారి ఎదుట హాజరై మీ యొక్క సంజాయిషీ తెలుపుకోవలసినదిగా నిన్ను ఆదేశించడమైనది. మీరు హాజరు కాకుండా తప్పిన యెడల మీ పరోక్షమున ఈ వ్యాజ్యమును విమర్శచేసి తీర్మానించ తగునని ఇందు మూలముగా తెలియపరచడమైనది.

వాయిదా తేది: 21-04-2025

పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
పెట్లూరి రామకృష్ణ మురళి
వాదితరపు న్యాయవాది,
కందుకూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

నోటీసు
Section 5 of The Limitation Act
మహారాజశ్రీ కందుకూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No.48/2025
O.S.No.224/2008

బొర్రా కోటేశ్వర రావు - పిటిషనర్/వాది
ఎదిరి
పురిమెట్ల పోలమ్మ (లేట్)
మరియు నలుగురు - రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

పూరిమెట్ల రమేష్, తండ్రి కొండయ్య,
ఉప్పుచెరువు కాలనీ నివాసము, కందుకూరు మునిసిపాలిటీ, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

పై నెంబరు దావాను పునరుద్ధరణకు జరిగిన కాలహరణను మన్నించ వలసిందిగా కోరుతూ పిటిషనర్ / వాది లిమిటేషన్ చట్టము క్రింద పిటిషన్ దాఖలు చేసివున్నారు. మీకు కోర్టు ద్వారానూ మరియు రిజిష్టరు పోస్టు ద్వారానూ నోటీసులు పంపినప్పటికి మీరు తీసుకొనక ఏదో ఒక కారణముతో త్రిప్పి పంపుతున్నారు. కావున మీరు **తే21-04-2025ది ఉదయం గం॥ 10.30 నిమిషములకు** మీరు స్వతహాగా గానీ, సంపూర్ణ సంజాయిషీ పొందిన అన్ని ప్రశ్నలకు సమాధానము చెప్ప కూడిన ప్లీడరు గారి ద్వారా పై కోర్టువారి ఎదుట హాజరై మీ యొక్క సంజాయిషీ తెలుపుకోవలసినదిగా నిన్ను ఆదేశించడమైనది. మీరు హాజరు కాకుండా తప్పిన యెడల మీ పరోక్షమున ఈ వ్యాజ్యమును విమర్శచేసి తీర్మానించ తగునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

వాయిదా తేది: 21-04-2025

పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
పెట్లూరి రామకృష్ణ మురళి
వాదితరపు న్యాయవాది,
కందుకూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

గౌరవనీయులైన 15వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, నూజివీడు
ఐ.ఎ.నెం.992/2023 ఇన్
ఒ.యస్.నెం.7/2017

బిట్వీన్ :
జవ్వాది వెంకట రావమ్మ ...పిటిషనర్
మరియు
సింగంశెట్టి సరస్వతమ్మ వగైరాలు ...రెస్పాండెంట్స్‌టు

1.సింగంశెట్టి సరస్వతమ్మ, భర్త : లేటు ప్రకాశరావు, వయస్సు 75 సం॥లు, డోర్‌నెం.1-2-234/15, యస్‌బిహెచ్ కాలనీ దగ్గర, దోమల్‌గూడ, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.
2.సింగంశెట్టి రమేష్‌బాబు, తండ్రి : లేటు ప్రకాశరావు, వయస్సు 50 సం॥లు, డోర్‌నెం.1-2-234/15, యస్‌బిహెచ్ కాలనీ దగ్గర, దోమల్‌గూడ, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.
9.సింగంశెట్టి సురేష్‌బాబు, తండ్రి : లేటు ప్రకాశరావు, వయస్సు 55 సం॥లు, డోర్‌నెం.1-2-234/15, యస్‌బిహెచ్ కాలనీ దగ్గర, దోమల్‌గూడ, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం.

పై నెంబరు ఐ.ఎలో 1,2,9 రెస్పాండెంట్లు అయిన మీరు పై తెలిపిన శ్రీకోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గాను ది.15.04.2025వ తేదీన వాయిదా ఉండియున్నది. సదరు తేదీన మీరు స్వయంగా గానీ, లేదా మీ న్యాయవాది ద్వారా గాని శ్రీకోర్టు వారి ఎదుట ఉదయం 10.30 గంటలకు హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమునందు పై తెలిపిన ఆర్డరు 1 రూల్ 10 పిటిషన్ ద్వారా మిమ్ములను దావాలో పార్టీలుగా చేర్చుటకు శ్రీకోర్టు వారు తీర్మానించెదరు.
(కోర్టు వారి అనుమతితో)

చందు నాగరాజు, న్యాయవాది,
విజయవాడ. సెల్: 9440327326
కె.జె.డిక్సన్, అడ్వకేట్,
నూజివీడు. సెల్:9848744799

ఆర్‌స్టీల్‌కు ట్రిమెట్రో గ్రూపు ఆర్డర్

గ్రీన్ టిఎంటి బార్‌ల డెలివరీ

హైదరాబాద్: ఆర్‌స్టీల్‌కు ట్రిమెట్రో గ్రూప్ నుంచి భారీ ఆర్డర్ దక్కింది. భువనేశ్వర్‌లోని ఎపిక్ గ్రూప్ తయారీ యూనిట్ నిర్మాణం కోసం గ్రీన్ టిఎంటి బార్‌లను ట్రిమెట్రో గ్రూపునకు అందించినట్లు ఆర్‌స్టీల్ తెలిపింది. ఎపిక్ గ్రూప్ రూ.377 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తోంది. ఈ బార్‌లు అత్యల్ప ఉద్గారాలతో తయారు చేయబడుతాయని ఆ కంపెనీ తెలిపింది. ఈ గ్రీన్‌స్టీల్‌తో కార్బన ఉద్గారాలు 20 శాతం మేర తగ్గనున్నాయని ఆర్‌స్టీల్ ప్రతినిధి అశ్వని కుమార్ భాటియా పేర్కొన్నారు.

ఉపాధి పనిప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

- టెంట్, తాగునీళ్లు అందుబాటులో ఉంచాలి : వ్యకాస

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామీణ ఉపాధి హామీ పని ప్రదేశాల్లో చట్ట ప్రకారం కనీస సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవాలనీ, నీడ కోసం టెంట్, దాహార్తిని తీర్చుకునేందుకు తాగునీటిని అందుబాటులో ఉంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పగటిపూట ఉష్ణోగ్రతలు 38 నుండి 42 డిగ్రీల మధ్య నమోదవుతుండటంతో పనిప్రదేశాల్లో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎండల నేపథ్యంలో ఒఆర్ఎస్ ప్యాకెట్లను, ప్రాథమిక చికిత్స కోసం మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని కోరారు. దూరపు ప్రాంతాల పనికి వెళ్లి రావడానికి కూలీలకు లోకల్ ఆటో కిరాయిలు ఇవ్వాలని చట్టం చెబుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు. ఇటీవల జహీరాబాద్ నియోజకవర్గం జరాసంగ్ మండలంలో చాంద్‌బి అనే ఉపాధి కూలీ రవాణా సౌకర్యం లేక పనిప్రదేశానికి నడుచుకుంటూ వెళ్లే క్రమంలో కుప్పకూలిపోయిన అంశాన్ని ప్రస్తావించారు. ఉపాధి కూలీలకు పనిప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రాజెక్ట్ అధికారులకు ఎండీఓలకు మార్గదర్శకాలు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

తీన్మార్ మల్లన్నపై మండలి చైర్మన్ ఆగ్రహం

- తీరు మార్చుకోకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- నిబంధనల ప్రకారమే స్కూల్ నడుపుతున్నా : ఎవిఎన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాసనమండలిలో గురువారం బిజెపి సభ్యుడు ఎవిఎన్ రెడ్డి పిటిషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం తీన్మార్ మల్లన్న తనపై ఆరోపణలు చేశారని అన్నారు. తాను నడుపుతున్న ప్రయివేటు పాఠశాలలో నర్సరీకి రూ.41,975 ఫీజును తీసుకుంటున్నారని అన్నారని గుర్తు చేశారు. అయితే అడ్డగోలుగా ఫీజులను వసూలు చేస్తున్నారంటూ చెప్పడం సరైంది కాదన్నారు. శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాశ్ ఆయన మనవడి కోసం నర్సరీలో చేర్పించేందుకు ఓ ప్రయివేటు పాఠశాలను సంప్రదిస్తే రూ.మూడు లక్షలు అడిగారంటూ వివరించారని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులను వసూలు చేస్తాయని వివరించారు. తాను నడిపే పాఠశాలల్లో అడ్డగోలుగా ఫీజులను వసూలు చేయడం లేదన్నారు. అయితే కొన్ని ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యావ్యాపారం చేస్తుండొచ్చని, కొందరు అధిక ఫీజులను వసూలు చేస్తుండొచ్చని అన్నారు. శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలు అలా చేస్తున్నాయని వివరించారు. తాను జీవో నెంబర్ ఒకటి ప్రకారం సొసైటీని ఏర్పాటు చేసుకుని ప్రయివేటు పాఠశాలలను నిబంధనల ప్రకారం నడుపుతున్నానని అన్నారు. తన పేరును ప్రస్తావించి, అడ్డగోలుగా ఫీజులను వసూలు చేస్తున్నారంటూ తీన్మార్ మల్లన్న వ్యాఖ్యానించడం సరైంది కాదన్నారు. విద్యాకమిషన్ నివేదిక ఆధారంగా ఫీజుల నియంత్రణ కోసం ప్రభుత్వం చట్టం చేస్తే దాన్ని పాటిస్తామని అన్నారు. దాన్ని అతిక్రమించి అధిక ఫీజులను వసూలు చేస్తే అప్పుడు తన గురించి మాట్లాడాలని చెప్పారు. దీనిపై తీన్మార్ మల్లన్న అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో ఉన్న సభ్యులు ప్రయివేటు విద్యాసంస్థలను నడుపుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని ఎలా పరిరక్షిస్తారని ప్రశ్నించారు. చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కల్పించుకుని సభలోని సభ్యుల పేర్లను ప్రస్తావించడం సరైంది కాదన్నారు. ఆ పేర్లను రికార్డుల నుంచి తొలగించామని అన్నారు. భవిష్యత్తులోనూ సభ్యుల పేర్లను ప్రస్తావించొద్దని సూచించారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ రికార్డుల నుంచి వారి పేర్లను తొలగించొద్దని అన్నారు. ఈ వైఖరి సరైంది కాదని తీన్మార్ మల్లన్నపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి సమాధానం ఇచ్చేందుకు ఆయన ప్రయత్నిస్తే ఇలాగే వ్యవహరిస్తే భవిష్యత్తులో క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి వస్తుందని చైర్మన్ హెచ్చరించారు. తీసుకోండి అని మల్లన్న అనడం గమనార్హం.

సిసిఐ భూములను రియల్ ఎస్టేట్‌గా మార్చే కుట్ర

- సంపదను కార్పొరేట్ సంస్థలకు బిజెపి అప్పగిస్తోంది
- పరిశ్రమను తెరిపించాలి.. లేదంటే ఎంపిలు రాజీనామా చేయాలి
- ఎన్నికల్లో ఇచ్చిన హామీని కేంద్రం నెరవేర్చాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదిలాబాద్ జిల్లా కేంద్రం సమీపంలో మూతపడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) భూములను రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చే కుట్ర జరుగుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. సంపదను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన మూతపడిన సిమెంట్ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా సిసిఐ సాధన కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సిసిఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కన్వీనర్ దర్శనాల మల్లేష్ అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన బహిరంగ సభలో జాన్‌వెస్లీ మాట్లాడారు. బిజెపి అధికారంలోకి వస్తే సిసిఐని తెరిపిస్తామని స్థానిక ఎమ్మెల్యే, ఎంపి హామీనిచ్చారని గుర్తు చేశారు. ఎన్నికల అనంతరం ఈ అంశాన్ని విస్మరించారని విమర్శించారు. సిసిఐకి చెందిన సంపదను అదానీకి కట్టబెట్టడంతోపాటు 700 ఎకరాల భూములను అన్యాక్రాంతం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. పరిశ్రమ పెడతామంటే ఆనాడు రైతులు కేవలం రూ.మూడు వేలకు ఎకరం చొప్పున భూములు ఇచ్చారని, ఇప్పుడు వాటి ధర రూ.కోట్లు పలుకుతున్నాయని తెలిపారు. అలా పోగుపడిన సిసిఐ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడమే కాకుండా స్థానిక ఎమ్మెల్యే, ఎంపి కలిసి రియల్ ఎస్టేట్ చేసి రూ.కోట్లు సంపాదించాలనే కుట్ర జరుగుతోందని వ్యాఖ్యానించారు. సిసిఐని తెరిపించేందుకు స్థానిక బిజెపి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని, లేదంటే పదవులకు రాజీనామా చేసి ఉద్యమంలో కలిసి రావాలని హితవు పలికారు. గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సైతం ఎన్నికల్లో బిజెపిని గెలిపిస్తే ఈ పరిశ్రమను తెరిపిస్తామని హామీనిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. సిసిఐని తెరిపించేందుకు ఇక్కడ అన్ని అనుకూలతలూ ఉన్నాయని, జాతీయ రహదారితోపాటు వందేళ్లకు సరిపడా ముడి సరుకు నిల్వలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పరిశ్రమను తెరిపించేందుకు కృషి చేయాలని కోరారు.

దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే పోగవుతోందని, ఫలితంగా నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం కుల, మత ఘర్షణలు సృష్టిస్తూ శ్రామికవర్గ పోరాటాలను పక్కదారి పట్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దోపిడీ విధానాలపై కార్పొరేట్ వ్యతిరేక శక్తులన్నీ కలిసి ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాస్, సిసిఐ సాధన కమిటీ కోకన్వీనర్ విజ్జగిరి నారాయణ, సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, నంది రామయ్య, అలాల అజయ్, గుడిపెల్లి నగేష్, సాజిద్‌ఖాన్, బండి దత్తాత్రి, బొల్లు ఈశ్వర్‌దాస్, వెంకట్ నారాయణ, దాసరి రమేష్ పాల్గొన్నారు.

తాగునీటిపై అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి సీతక్క ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

వేసవి నేపథ్యంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. వారంలో నాలుగు రోజులు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసమావేశానికి ఆయా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఎంపిడిఒ, ఇంట్రా ఎఈ, గ్రిడ్ ఎఈ, మండల స్పెషల్ ఆఫీసర్లతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కమిటీలు సమన్వయంతో పనిచేసి ఎక్కడ తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. వరుసగా పండుగలు వస్తున్నాయని, ప్రజలంతా ఊర్లలోనే ఉంటారని వివరించారు.మూడు రోజుల పాటు తాగు నీటి సరఫరాకు ఇబ్బందులు రావద్దని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకునే విధంగా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తున్నామని అన్నారు. పంచాయతీరాజ్ రోడ్లు, ఆర్ అండ్ బీ రోడ్లు, విద్యుత్ పనులతో మిషన్ భగీరథ పైపులు దెబ్బతినకుండా చూడాలని చెప్పారు. జిల్లా కలెక్టర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని వివరించారు. స్థానికంగా నీటి వనరులు అందుబాటులో ఉన్నచోట బోర్లను అద్దెతీసుకుని నీటిని అందించాలని చెప్పారు. గత పదేండ్లల్లో వేల సంఖ్యలో బోర్లను పట్టించుకోలేదని గుర్తు చేశారు. ఎమ్మెల్యేలతో మిషన్ భగీరథ అధికారులు సమావేశం కావాలనీ, వారి సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్ జి కృపాకర్‌రెడ్డి, సిఇ చెన్నారెడ్డి, ఎస్ఈ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ బోర్డు పునరుద్ధరణ

మిషన్ భగీరథ డైరెక్టర్లతో కూడిన బోర్డు సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. తాగునీటితో పాటు 23 అంశాలపై బోర్డు చర్చించింది. కొత్త బోర్డును ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా మంత్రి సీతక్క, డైరెక్టర్లుగా డిఎస్ లోకేష్‌కుమార్, టికె శ్రీదేవి, ఇ సృజన, జి కృపాకర్‌రెడ్డి, జి అనిల్‌కుమార్, పి. వెంకటేశ్వర్‌రావు, పి శ్రీనివాసరెడ్డి, జె మధుబాబు ఉన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా చలివేంద్రాలు

రాష్ట్రవ్యాప్తంగా ఎండాకాలం కారణంగా 4818 చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మంత్రి సీతక్క తెలిపారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ వీటిని అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. ఆయా పనుల నిమిత్తం బయటకు వచ్చిన వారి కోసం చలివేంద్రాల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నటు చెప్పారు.

టన్నెల్‌లో కొనసాగుతున్న సహాయక చర్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎల్‌బిసి టన్నెల్ లోపల సహాయక చర్యలపై సహాయక బృందాలు ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బిసి టన్నెల్ లోపల చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరాయంగా సహాయక బృందాలు పనిచేస్తున్నాయి. రెట్టింపు వేగంతో సహాయక చర్యలను కొనసాగించాలని అధికారులకు సూచించారు. ప్రమాద ప్రదేశం నుంచి 30 మీటర్ల వరకూ భారీ కేడింగ్ చేసినట్టు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరుపుతున్నట్టు వివరించారు. సొరంగంలో మట్టి తవ్వకాలకు అడ్డంకిగా ఉన్న స్టీల్‌ను తొలగిస్తూ ఎప్పటికప్పుడూ ఊట నీటిని పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నట్టు వివరించారు. మట్టి కింద ఉన్న లోకో ట్రైన్ క్యాబిన్లను తొలగించి లోకో ఇంజిన్ బయటకు తీసే పనులు సాగుతున్నాయన్నారు. పెద్ద బండ రాళ్లను ఎస్కవేటర్ ద్వారా తొలగిస్తూ, టీబీఎం భాగాలను అల్ట్రా థర్మల్ కట్టర్ ద్వారా కట్ చేస్తూ వాటి భాగాలను లోకో ట్రైన్ ద్వారా బయటకు తీసుకోస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, కల్వకుర్తి ఆర్‌డిఒ శ్రీనివాసులు, ఎన్‌డిఆర్ఎఫ్ అధికారి కిరణ్‌కుమార్, ఎస్‌డిఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేతి చంద్ర, జిఎస్ఐ అధికారి పంకజ్ తిరుగున్, హైడ్రా అధికారి యజ్ఞ నారాయణ, జెపి కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉగాదికి పస్తులేనా?

- 'ఉపాధి' ఉద్యోగులకు మూడు నెలలుగా అందని జీతాలు
- వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీతక్కకు వేడుకోలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీ చట్టంలో పనిచేసే కార్మికులుకే కాదు ఉద్యోగులకూ సర్కారు వేతనాలివ్వడం లేదు. ఒకటెండ్రు కాదు మూడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో పడుతున్న వ్యథలు అన్నీ ఇన్నీ కావు. జీతాలు అందకున్నా..అప్పులు చేసుకుని మరీ బతుకులు వెళ్లదీస్తున్నారు. 19 ఏళ్ల నుంచి పనిచేస్తున్న తమను రాష్ట్ర సర్కారు ఎప్పటికైనా పర్మినెంట్ చేయకపోతుందా? అనే చిన్న ఆశతో 3,874 మంది కాంట్రాక్టు కార్మికులు కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. 'జీతాలివ్వకుంటే ఎట్ల బతకాలి? ఉగాదికి పస్తులుండాల్సిందేనా?' అంటూ ఆ కాంట్రాక్టు కార్మికులు వాపోతున్నారు. జీతాలిప్పించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క)ను చేతులెత్తి వేడుకుంటున్నారు.

ఉపాధి హామీ చట్టంలో గ్రామాల్లో కార్మికులకు పనులు గుర్తించి ఫైనల్ చేయడం, బిల్లులు క్లియర్ చేయడం ఎస్ఆర్‌డిఎస్ కింద కాంట్రాక్టు పద్ధతిలో 3,874 మంది ఉద్యోగులు 19 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారు. వారిలో 396 మంది అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు 2072 మంది, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీలు, జూనియర్ ఇంజనీర్లు 356 మంది, కంప్యూటర్ ఆపరేటర్లు/అకౌంట్స్ అసిస్టెంట్లు 887 మంది, ప్లాంటేషన్ సూపర్‌వైజర్లు 27 మంది, కోర్సు డైరెక్టర్-సిఎల్ఆర్‌సి 18 మంది, అడిషనల్ డిఆర్‌పి 14 మంది, మేనేజర్ హెచ్/డిబిటి/అకౌంట్స్‌లో 23 మంది, అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్లు పది మంది, ప్లాంటేషన్ మేనేజర్లు ముగ్గురు, కోర్సు డైరెక్టర్లు-డిఎల్ఆర్‌సిలు నలుగురు, ప్రాజెక్టు ఆఫీసర్లు 23 మంది, స్టేట్ ప్రోగ్రామింగ్ మేనేజర్లు ముగ్గురు, ఒక లా ఆఫీసర్, ఎమ్ఐఎస్/ఐటీ మేనేజర్లు ఇద్దరు, ఫైనాన్స్ అకౌంట్ మేనేజర్ ఒకరు, ఈజీఎస్ ప్రోగ్రామ్ మేనేజర్ ఒకరు, ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్‌లు ఇద్దరు, ఎటిఇ (ఎన్ఆర్ఎం) ఒకరు, ఎటిఇ (ఎంఐఎస్/ఐటి) ఒకరు, అడ్మినిస్ట్రేషన్ సీనియర్ ఆఫీసర్ ఒకరు, అసిస్టెంట్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్‌లు ఏడుగురు, డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్లు ఎనిమిది మంది, కంప్యూటర్ ఆపరేటర్లు/డిఇఒలు 11 మంది, జూనియర్ అసిస్టెంట్లు ఒకరు, డిస్పాచర్ కమ్ ఆఫీస్ సబార్డినేటర్ ఒకరు ఉన్నారు. వీరంతా ఉపాధి హామీ కార్మికులతో పనులను చేయించడంలో, బిల్లింగ్ చేయడంలో, కూలీలకు వేతనాలు అందించడంలో జరిగే అన్ని ప్రక్రియల్లోనూ పాలు పంచుకుంటారు. ఉపాధి హామీ పనులను క్రమం తప్పకుండా చేయిస్తూ కేంద్రం నుంచి వీలైనంత మేరకు ఎక్కువ నిధులను రప్పించడంలో వీరే కీలక భూమిక పోషిస్తున్నారు.

ఉపాధి హామీ పనులు, హరితహారం, రైతు వేదికలు, శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, నీటి నిల్వ పనులు, పండ్ల తోటల పెంపకం, మల్బరీ తోటల పర్యవేక్షణ, నర్సరీల నిర్వహణ, ఇలా 220 రకాల పనులను పర్యవేక్షిస్తున్నారు. 16 శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇంత పనిచేస్తున్న వీరికి జీతాలు మాత్రం సకాలంలో అందట్లేదు. రాష్ట్ర సర్కారు డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించిన వేతనాలను పెండింగ్‌లో పెట్టింది. రెండు రోజులైతే మార్చి నెల కూడా పూర్తవుతుంది. ఈ నెల 31న ఉగాది పండుగ ఉన్న విషయం విదితమే. వేతనాల గురించి ఆఫీసర్ల చుట్టూ తిరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోని పరిస్థితి. 'మూడు నెలల నుంచి జీతాలివ్వకపోతే ఎలా బతకాలి? ఉగాదికి పస్తులుండాల్సిందేనా? సీతక్కా దండం పెడుతున్నాం వెంటనే వేతనాలను ఇప్పించండి' అంటూ వారు వేడుకుంటున్నారు.

పర్మినెంట్ హామీని విస్మరించిన కాంగ్రెస్ సర్కార్

బిఆర్ఎస్ ప్రభుత్వం 2014 కంటే ముందు నుంచి పలుశాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసింది. గ్రామీణాభివృద్ధి శాఖలో ఉపాధి హామీ చట్టం నిర్వహణలో పనిచేస్తున్న 3,874 మంది ఉద్యోగులను మాత్రం విస్మరించింది. 19 ఏళ్ల నుంచి పనిచేస్తున్న పర్మినెంట్ చేయలేదన్న అంశాన్ని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఒక అస్త్రంగా మార్చుకున్నది. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్మినెంట్ చేస్తామనీ, పేస్కేలు అమలు చేస్తామని హామీనిచ్చింది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం వచ్చిన తొలినాళ్లలో వీరి పర్మినెంట్ విషయంపై కొంత హడావిడి నడిచింది. ఆ తర్వాత ఏమైందో ఏమోగానీ ఉద్యోగుల పర్మినెంట్ ఫైలు ఉన్నతస్థాయి అధికారుల దగ్గర పెండింగ్‌లో పడిపోయింది. ఏడాదిగా ఒక్కడుగు కూడా ముందుకు పడలేదు.

వాగ్దానాల అమలు బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

- కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం పోరాడాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పోరాటం చేయాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో మీడియా సమావేశాన్నిఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముందని సూచించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను తిరిగి చేయకుండా సజావుగా పాలన సాగించాలని కోరారు. బీఆర్ఎస్ అప్పులు చేసిందంటూ చెప్పే కాలం ముగిసిందన్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తున్నదనే దానిపై దృష్టి పెట్టాలని చెప్పారు. 2025-26 వార్షిక బడ్జెట్ పేదలకు అనుకూలమైన బడ్జెట్ కాదన్నారు. అప్పులు ఎక్కువగా ఉన్నాయనీ, హామీలు కూడా ఎక్కువగానే ఉన్నాయని వివరించారు. ఎన్నికల్లో వాగ్దానాలను విపరీతంగా చేశారనీ, వాటిని నెరవేర్చడానికి తిప్పలు పడుతున్నారని అన్నారు. రైతు రుణమాఫీ గుదిబండగా మారిందని, సాంకేతిక కారణాల వల్ల చాలామందికి మాఫీ జరగలేదని వివరించారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి, రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఆసరా పెన్షన్లను రూ.నాలుగు వేలకు పెంచాలనీ, మహిళలకు నెలకు రూ.2,500 చెల్లించాలనీ, కళ్యాణలక్ష్మి కింద ఆడపిల్లల పెండ్లికి రూ.లక్ష నగదుతోపాటు తులం బంగారం ఇవ్వాలని కోరారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులను పూర్తిగా ఖర్చు చేయాలని సూచించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల వాటాను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఒకవేళ ఇవ్వకుంటే కలిసి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈసారి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బాగా జరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సుమారు 4.50 లక్షల మంది పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రెండు కోట్ల మంది కార్మికులున్నారని, వారికి కనీస వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులను పేదల కేటగిరిలో పరిగణించాలి

జర్నలిస్టులను పేదల కేటగిరిలో పరిగణించాలనీ, వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కూనంనేని సూచించారు. వారికి కూడా కనీస వేతనం అమలు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు చెప్పిందనే పేరుతో జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ఉండటం మంచిది కాదనీ, పేదల కేటగిరిలో వారికి ఇండ్ల స్థలాలను మంజూరు చేయాలని సూచించారు. జర్నలిస్టుల ఆరోగ్య బీమా తదితర సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు జర్నలిస్టుల కోసం పాలసీ తేవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఏ ఈజం లేదనీ, టూరిజం మాత్రమే ఉందని చంద్రబాబు అనేవారని గుర్తు చేశారు. అందుకే తమకు కోపం వచ్చేదన్నారు. కానీ పెట్టుబడి లేనిది టూరిజమని, లాభాలు వస్తాయని, ఉపాధి కల్పించేందుకు అవకాశముంటుందనీ, టూరిజంను అభివృద్ధి చేయాలని తాను రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేశానని అన్నారు. దీన్ని కొందరు దురుద్దేశంతో ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఆయన చెప్పింది నిజమని నమ్మడానికి కమ్యూనిస్టులకు 30 ఏండ్లు పట్టిందంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారని అన్నారు. మనిషి ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుందని చెప్పారు. కమ్యూనిజాన్ని, టూరిజాన్ని వేరువేరుగా చూడాలన్నారు. చైనా కూడా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తుందని గుర్తు చేశారు.

తెలంగాణకు కేంద్రం అన్యాయం : నెల్లికంటి సత్యం

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేస్తున్నదని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. తెలంగాణ పట్ల కేంద్రం సవతి తల్లి ప్రేమను చూపిస్తోందని అన్నారు. రాష్ట్రంలో వడగండ్ల వాన, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, బాగం హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం దృష్టికి టిడబ్ల్యుజెఎఫ్ వినతి

- జర్నలిస్టుల రైల్వేపాస్‌లు పునరుద్ధరించాలని ఎంపి వద్దిరాజు విజ్ఞప్తి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ విజ్ఞప్తిని ఎంపి వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభ దృష్టికి గురువారం తీసుకెళ్లారు. రైల్వేలో కరోనా ముందు వరకు జర్నలిస్టులకు ఇచ్చిన 50 శాతం రాయితీని పునరుద్ధరించాల్సిందిగా ఎంపి కోరారు. ఈ మేరకు టిడబ్ల్యుజెఎఫ్ ఈ నెల 24వ తేదీన రాజ్యసభ, లోక్‌సభ ఎంపిలు వద్దిరాజు రవిచంద్ర, రామసహాయం రఘురాంరెడ్డికి ఆన్‌లైన్‌లో వినతిపత్రాలు పంపింది. ఈ విషయమై పార్లమెంటులో ప్రస్తావించడంతో పాటు రైల్వేశాఖ మంత్రి దృష్టికి సైతం తీసుకువెళ్లాల్సిందిగా టిడబ్ల్యుజెఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఫోన్‌లో విన్నవించింది. దీనిపై ఇరువురు ఎంపిలు సానుకూలంగా స్పందించారు. కచ్చితంగా పార్లమెంటు దృష్టికి జర్నలిస్టుల రైల్వేపాస్‌ల విషయాన్ని తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభలో గురువారం ప్రస్తావించారు. ఆ వెంటనే రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో అక్రిడేటెడ్ జర్నలిస్టులకు రైల్వేలో 50% రాయితీపై ప్రయాణించే సౌకర్యం ఉండేదని, దానిని కోవిడ్ లాక్‌డౌన్ సందర్భంగా నిలిపివేశారని తెలిపారు. తిరిగి రైలు రాయితీని పునరుద్ధరించాలని కోరారు. జర్నలిస్టులలో చాలా వరకు పేద, మధ్య తరగతి ఆదాయ వర్గాలకు చెందిన వారేననీ, తమ విధి నిర్వహణలో భాగంగా నిత్యం రైళ్లలో ప్రయాణాలు చేస్తుంటారన్నారు. కోవిడ్ కారణంగా రద్దుచేసిన రాయితీ పథకాన్ని తిరిగి పునరుద్ధరించి వారిపై ఆర్థిక భారం పడకుండా సాయం చేయాల్సిందిగా రైల్వే మంత్రిత్వ శాఖను కోరారు. రైలు ప్రయాణాల సందర్భంగా గతంలో మాదిరిగా 50 శాతం రాయితీని పునరుద్ధరించాల్సిందిగా పాత్రికేయులు, వారి సంఘాలు మూడేళ్లుగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తుండడాన్ని ఈ సందర్భంగా ఎంపి వద్దిరాజు గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్థంభంగా సమాజానికి తమ విలువైన సేవలందిస్తున్న జర్నలిస్టులకు రైల్వే టికెట్లలో 50 శాతం రాయితీ కల్పించడమనేది సమంజసం, సముచితమని ఎంపి రవిచంద్ర చెప్పారు. అలాగే, రాజ్యసభలో మాట్లాడిన తర్వాత ఎంపీ వద్దిరాజు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను పార్లమెంటులోని ఆయన ఛాంబర్‌లో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంటనే సానుకూలంగా స్పందిస్తూ అధికారులకు తగు ఆదేశాలిచ్చారు.

చందానగర్‌లో కళ్యాణ్ జ్యువెలర్స్ కొత్త షోరూం ఏర్పాటు

- ప్రారంభించిన నటుడు నాగార్జున

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ ఆభరణాల బ్రాండ్‌లలో ఒకటైన కళ్యాణ్ జ్యువెలర్స్ హైదరాబాద్‌లోని చందానగర్‌లో ఏర్పాటు చేసిన నూతన షోరూంను ప్రముఖ హీరో అక్కినేని నాగార్జున లాంచనంగా ప్రారంభించారు. ఇక్కడ అన్ని రకాల శ్రేణీలో అభరణాలు లభ్యమవుతాయని ఆ సంస్థ పేర్కొంది. 'ట్రస్ట్ ఈజ్ ఎవ్రీథింగ్' అనే సిద్ధాంతానికి అనుగుణంగా వారు చూపుతున్న నిబద్ధత పరిశ్రమలో వారిని ప్రత్యేకంగా నిలబెట్టిందని నాగర్జున అన్నారు.

కూతుర్ని ప్రేమించాడని దారుణ హత్య

- యువకున్ని గొడ్డలితో నరికి చంపిన యువతి తండ్రి
- పెద్దపల్లి జిల్లా ముప్పిరితోటలో విషాదం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో గురువారం రాత్రి ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. తన కూతుర్ని ప్రేమిస్తున్నాడనే కోపంతో ఓ వ్యక్తి గ్రామ నడిబొడ్డున యువకున్ని గొడ్డలితో విచక్షణారహితంగా నరికి హత్య చేశాడు. తన పుట్టిన రోజు వేడుకల్లో ఆనందంగా గడిపిన యువకుడు ఆ రాత్రే విగతజీవిగా మారడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ సిహెచ్ సనత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ముప్పిరితోటకు చెందిన పూరెల్ల సాయికుమార్ (20), అదే గ్రామానికి చెందిన ఓ యువతి రెండేళ్లుగా ప్రేమలో ఉన్నారు. ఇద్దరు బిసి సామాజిక తరగతికి చెందినవారే అయినప్పటికీ వేర్వేరు ఉపకులాలు కావడంతో అమ్మాయి తల్లిదండ్రులు వారి ప్రేమను నిరాకరించారు. పలుమార్లు సాయిని మందలించారు. అయినా, ఇద్దరూ పెళ్లికి సిద్ధం కావడంతో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరిగాయి. సాయి కుమార్‌పై యువతి తండ్రి సదయ్య కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయికుమార్ తన పుట్టినరోజు కావడంతో అమ్మాయి ఇంటి సమీపంలోని వెంటకటేశ్వరస్వామి ఆలయం వద్ద వేడుకలు నిర్వహించుకున్నాడు. ఇదే అదనుగా భావించిన యువతి తండ్రి సదయ్య అక్కడికి వెళ్లి గొడ్డలితో సాయి మెడపై వేటువేశాడు. తీవ్ర గాయాలతో సాయి పారిపోయేందుకు ప్రయత్నించి కొద్దిదూరంలో పడిపోయాడు. కింద పడిన వెంటనే మళ్లీ పలుమార్లు విచక్షణారహితంగా నరికి ప్రాణం పోయిందని నిర్ధారించుకున్నాక సదయ్య అక్కడి నుంచి పరారయ్యాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. పరారీలో ఉన్న సదయ్యను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ దారుణం బాధిత కుటుంబాన్ని, గ్రామస్తులను కన్నీటిలో ముంచెత్తింది. గ్రామంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.